
సాక్షి విజయనగరం

గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



ఇండియన్ ఏటీఎంల్లో చోరీలు
గజపతినగరం పోలీస్ సర్కిల్ పరిధిలో ఇండియన్ ఏటీఎంకు చెందిన రెండు కేంద్రాల్లో భారీ చోరీ జరిగింది. - 8లో



బిడ్డను రక్షించి.. మృత్యుఒడిలోకి..
తను ప్రయాణించిన బస్సే మృత్యుశకటమైంది. రోడ్డు ప్రమాదంలో బిడ్డను రక్షించి తండ్రి మృత్యు ఒడికి చేరాడు. - 8లో



ఆన్‌లైన్‌లో.. 'అంగన్‌వాడీ'ల సేవలు
అంగన్‌వాడీ కేంద్రాలను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. - 8లో

న్యూస్‌రీల్

కొండగంగుబూడిలో ఆక్రమణల తొలగింపు



కొండగంగుబూడి రెవెన్యూలో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకళ, రెవెన్యూ అధికారులు

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి ఆక్రమించి లే అవుట్‌వేసినట్టు అందిన ఫిర్యాదుమేరకు ఆర్డీఓ సూర్యకళ బుధవారం పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం తహసీల్దార్ ప్రసన్నకుమార్, హెచ్‌డీటీ సన్యాసినాయుడు, మండల సర్వేయర్ అప్పలనాయుడు, ఆర్ఐ రామలక్ష్మి తదితరుల సమక్షంలో ఆక్రమణలను గుర్తించారు. లే అవుట్ ప్రహరీని, కంచెలను తొలగించారు. ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. సర్వేనంబర్ 27/1లో 4.28 ఎకరాలు గయ్యాలి, 27/3లో 55 సెంట్లు వాగు, 27/4లో గయ్యాలి, సర్వేనెం 1లో 2 ఎకరాల కొండపోరంబోకు భూమి ఉందని, ఆక్రమణదారులు శిక్షార్హులని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అనంతరం కొత్తవలస-ఎస్.కోట జాతీయ రహదారి విస్తరణలో వేసిన సర్వే రాళ్లను పరిశీలించారు. జగ్గయ్యపేటలోని జగనన్న కాలనీలోని గృహనిర్మాణాలను చూశారు. కార్యక్రమంలో వీఆర్వో అప్పారావు, సచివాలయ సర్వేయర్ ఎస్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

- సెంటర్ ఫర్ లీడర్‌షిప్ శిక్షణ నిపుణులు, గ్రూప్ కెప్టెన్లు కె.సంజీవ్ కుమార్, రాహుల్ త్యాగి



వర్క్‌షాప్‌లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న గ్రూప్ కెప్టెన్లు

విజయనగరం రూరల్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సెంటర్ ఫర్ లీడర్‌షిప్ శిక్షణనిపుణులు, గ్రూప్ కెప్టెన్లు కె.సంజీవ్ కుమార్, రాహుల్ త్యాగీలు కోరారు. నాయకత్వ లక్షణాలు, నడవడికపై కోరుకొండ సైనిక పాఠశాలలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో సమర్థవంతమైన నాయకుడిగా ఎదిగేందుకు అవసరమైన ప్రవర్తనా మార్పులను వివరించారు. 9 నుంచి12 తరగతులకు చెందిన క్యాడెట్‌లకు ఆఫీసర్ లైక్ క్వాలిటీస్, సాయుధ బలగాల్లోకి ఎంపిక చేయడంలో మెరుగైన పనితీరుకు వారికి అవసరమైన మార్గాలపై అవగాహన కల్పించారు. బాలికలకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, వారికి ఎన్‌డీఏ, సాయుధ బలగాల్లోకి ప్రవేశ విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం కోరుకొండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి శిక్షకులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో పతకాల పంట



జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: జార్ఖండ్ రాష్ట్రంలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన 14వ ఓపెన్ జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో పాటు 12 పతకాలు సాధించారు. పోటీల్లో జిల్లా నుంచి 16 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ఎం.గగన్ సాగర్‌దొర, కె.చైతన్య, బి.హేమంత్ కుమార్, బి.భవ్యశ్రావణి, టి.సంకీర్తనలు బంగారు పతకాలు సొంతం చేసుకోగా, పి.హర్షిణి, ఎస్.సాత్విక్, కె.సాహిత్యలు వెండి పతకాలు దక్కించుకున్నారు. జి.గౌతమ్, డి.ప్రియవల్లి, వి.దేవన్ మణికంత, వై.ముఖేష్ విశ్వనాథ్ కాంస్య పతకాలు సాధించారు. జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు బుధవారం అభినందించారు. క్రీడల్లో రాణించిన యువత మంచి ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వర్ధమాన క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువగా.. రీ సర్వే



హద్దురాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న సర్వే శాఖ ఏడీ టి.త్రివిక్రమరావు (ఫైల్)

- ఈ నెల 17 నుంచి శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీకి సన్నాహాలు
- రెండో విడత 198 గ్రామాల్లో రీ సర్వే పూర్తి
- ఇప్పటికే 179 గ్రామాల్లో 61 వేల రైతులకు భూహక్కు పత్రాల పంపిణీ, హద్దురాళ్ల ఏర్పాటు పూర్తి
- రెండో విడతలో పూర్తయిన గ్రామాల్లో 43 గ్రామాల్లో హద్దురాళ్లు పాతడం పూర్తి

విజయనగరం అర్బన్: వందేళ్ల నాటి భూ రికార్డులను క్రమబద్ధీకరిస్తూ.. దీర్ఘకాలిక భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష' పథకం రీ సర్వే ప్రక్రియ విజయనగరం జిల్లాలో చురుగ్గా సాగుతోంది. లక్ష్యానికి చేరువలో ఉంది. నిర్దేశిత గడువులోగా భూముల రీసర్వే పూర్తిచేసి రైతులకు శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ దిశగా జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోంది. మొదటివిడతలో 179 గ్రామాల్లో 61,751 మంది రైతుల భూములను రీ సర్వే పూర్తిచేసింది. శతశాతం హద్దురాళ్లు పాతించింది. దాదాపు 50 వేల మంది రైతులకు మొదటి విడతలో భూహక్కు పత్రాలను అందజేసింది. రెండో విడతలో తొలుత 319 గ్రామాల్లోని 71,881 మంది రైతుల భూములను ఆగస్టు నెలలోగా సర్వే పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. వర్షాల కారణంగా ఆ లక్ష్యాన్ని 198 గ్రామాలకు కుదించగా, అన్ని గ్రామాల్లోనూ రీ సర్వే పూర్తయింది. 43 గ్రామాల్లో హద్దురాళ్లు పాతడం పూర్తిచేసింది. రెండో విడత రీ సర్వే గ్రామాల రైతులకు ఈ నెల 17 నుంచి భూహక్కుపత్రాలను పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసింది.

కచ్చితమైన సర్వే..
సర్వే ఆఫ్ ఇండియా, ప్రైవేట్ ఏజెన్సీలు డ్రోన్ సర్వే చేసి ఇచ్చిన చిత్రాలు (ఓఆర్ఐ), భూ యజమనులు వాస్తవంగా చూపించిన సరిహద్దులను పోల్చి సర్వే అధికారులు కొలతలు వేస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 983 గ్రామాల్లో రీసర్వే చేయడానికి 3,842.53 స్క్వేర్ కిలోమీటర్ల విస్తీర్ణం ఉంది. భూహక్కులను ఇంచ్ పరిధి కూడా తేడా రానీయకుండా సూక్ష్మ పరిశీలనతో చేపడుతున్న ఈ ప్రక్రియ వివిధ దశలలో సర్వే విభాగం, రెవెన్యూ శాఖ సమాంతరంగా నిర్వహిస్తోంది. ఇప్పటికే జిల్లాలో మొదటివిడత రీసర్వే పనులు 179 గ్రామాల్లో విజయవంతంగా పూర్తయ్యాయి. రెండో విడత 319 లక్ష్యంలోని మరో 198 గ్రామాల సర్వే పనులు పూర్తి చేసుకొని భూహక్కు పత్రాల పంపిణీకి జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

భూహక్కు పత్రాల రూపురేఖలు:
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం–రెవెన్యూ శాఖ నూతనంగా రూపొందించి అందిస్తున్న భూమి యాజమాన్యపు హక్కు, పట్టాదారు పాసు పుస్తకం భూ హక్కు పత్రంలో నిక్షిప్తమైన అంశాలు ఇలా...

- మొదటి పేజీలో జిల్లా, డివిజన్, మండలం, గ్రామం ఖాతా నంబర్, పాస్‌పుస్తకం ఇచ్చిన తేదీ, పట్టాదారు వివరాలు, చిరునామా, కులం, ఆధార్‌నంబర్, మొబైల్ నంబర్ ఉంటుంది. పట్టాదారుని ఫొటో క్యూ ఆర్ కోడ్ ముద్రిస్తారు. మొబైల్ ఫోన్ సహాయంతో క్యూఆర్‌కోడ్ స్కాన్ చేస్తే పట్టాదారులని వివరాలు పాస్ పుస్తకం వివరాలు తెలుసుకోవచ్చు.
- రెండో పేజీలోలో పట్టాదారునకు గ్రామంలో ఉన్న భూమి వివరాలు అంటే సర్వే నంబర్ విస్తీర్ణం నమోదై ఉంటాయి. ఇంకా భూమి వర్గీకరణ, పట్టాదారునకు పట్టా భూమి ఏవిధంగా దాఖలు పడిందీ తదితర విషయాలు, రీ సర్వేలో పట్టాదారుని భూమికి సర్వేనంబర్ వారీగా ఇచ్చిన ఎల్.పి.నంబర్ వివరాలు ఉంటాయి.
- టైటిల్ డీడ్, పట్టాదారు పాస్ పుస్తకానికి సంబంధించిన వాస్తవికతను తెలుసుకొనుటకు క్యూఆర్ కోడ్ ఉపయోగపడుతుంది.
- పట్టాదారు పుస్తకంలో భూమి కమతం పటం, విశిష్ట సంఖ్యతో ఉన్న కమతానికి సంబంధించిన అక్షాంశాలు నమోదవుతాయి. దీనివల్ల భూమి కొలతలు సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.
- క్యూఆర్ కోడ్‌తో మొబైల్ స్కాన్ వల్ల భూమి సరిహద్దురాళ్లు ఎవరైనా మార్చినా కమతాల అక్షాంశాల వివరాలతో వాస్తవికతను కూడా తెలుసుకోవచ్చు.

భూహక్కు పత్రాలు పంపిణీ చేసిన గ్రామాలు డివిజన్ వారీగా....

రెవెన్యూ డివిజన్	మొదటి విడత	రెండో విడత
బొబ్బిలి	99	160
చీపురుపల్లి	55	101
విజయనగరం	25	58
మొత్తం	179	319

ప్రభుత్వ సూచనలు

- భూహక్కు పాస్ పుస్తకాన్ని అత్యంత భద్రతా ప్రమాణాలతో రూపొందించారు.
- రైతులు తమ భూముల వివరాలను 'మీ భూమి' వెబ్ సైట్‌లో చూసుకోవచ్చు.
- పాస్‌పుస్తకంలో పొందుపరచిన భూముల వివరాలు కాక ఇతర లావాదేవీలు కోసం కొత్త భూమి యాజమాన్యపు హక్కు పత్రం మరియు పట్టాదారు పాస్ పుస్తకం తీసుకోవడం ఐచ్ఛికం. మరో మార్గంలో అయితే ఆ వివరాలతో కూడిన 1–బీ నమూనా గ్రామ/వార్డ్ సచివాలయం/మీ సేవ కేంద్రాల్లో పొందవచ్చు.
- బ్యాంకు రుణాల తీసుకున్న సందర్భంలో, భూమి రిజిస్ట్రేషన్ చేసిన సమయంలోనూ భూమి యాజమాన్యపు హక్కు పత్రం, పట్టాదారు పాస్ పుస్తకం అధికారికంగా చూపించాల్సిన అవసరం లేదు.
- పుస్తకం పోయినా/చిరిగిపోయినచో గ్రామ/వార్డు సచివాలయాలంలో నిర్ణీత రుసుంను చెల్లించి డూప్లికేట్ భూమి యాజమాన్యపు హక్కుపత్రం, పట్టాదారు పాస్ పుస్తకాన్ని పొందవచ్చు.

స్వయంగా సరి చూసుకోవాలి



జిల్లాలో రీ సర్వే ప్రక్రియ మొదటిదశ నుంచి హక్కుదారులు చూసుకోవాలి. రెండో విడత లక్ష్యంగా పెట్టుకున్న 198 గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. 43 గ్రామాల్లో హద్దురాళ్లను ఏర్పాటు చేశాం. హద్దురాళ్లను పాతేటప్పుడు భూయజమాని తప్పక హాజరుకావాలి. హద్దులు సరిగ్గా నిర్ణయించి రాళ్లను ఏర్పాటు చేస్తున్నదీ లేనిదీ స్వయంగా సరి చూసుకోవాలి.
– టి.త్రివిక్రమరావు, సర్వే శాఖ సహాయ సంచాలకుడు

గడువులోగా రీ సర్వే పూర్తి



జిల్లాలో రీ సర్వే పనులు షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తున్నాం. తొలి విడతగా ప్రారంభించిన 179 గ్రామాల్లో సర్వే పనులు, హద్దురాళ్ల పాతడం, భూహక్కు పత్రాల పంపిణీ పూర్తి చేశాం. రెండో విడతగా మరో 319 గ్రామాలకు రీ–సర్వే లక్ష్యం ఇచ్చారు. వాతావరణ కారణంగా జరిగిన అంతరాయం దృష్ట్యా 198 గ్రామాలకు కుదించారు. ఈ గ్రామాల్లో రీ సర్వే తుది దశకు చేరింది.
–వి.సూర్యనారాయణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కేఆర్ఆర్‌సీ

శ్రీకృష్ణాష్టమి శోభ

శ్రీకృష్ణాష్టమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా బుధవారం వైభవంగా సాగాయి. గోపికలు,శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు మురిపించగా, ఊరూరా నిర్వహించిన ఉట్టికొట్టే సంబరాల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.
– సాక్షినెట్‌వర్క్



బొండపల్లి: పురిటిపెంటలో శ్రీకృష్ణ, గోపిక వేషధారణలో చిన్నారులు



పాచిపెంట మెయిన్‌రోడ్డులో కృష్ణాష్టమి సంబరాల్లో చిన్నారులు



బొబ్బిలి పట్టణం స్వామివారివీధి అంగన్‌వాడీ కేంద్రంలో గోపికల సమక్షంలో ఉట్టికొడుతున్న శ్రీకృష్ణ వేషధారి



రేగిడి: అంబఖండిలో ఉట్టికొట్టే సంబరాల్లో యువత

9న అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్టు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.లీలాకృష్ణ బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు నగర శివారులోని విజ్జీస్టేడియం ప్రాంగణంలో అండర్–14, 16, 18, 20, 23 వయస్సుల విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. అండర్–14 విభాగంలో పాల్గొనబోయే క్రీడాకారులు 2009 నవంబర్ 11 నుంచి, 2011 నవంబర్ 10వ తేదీ మధ్య, అండర్–16కు 2007 నవంబర్ 11తేదీ నుంచి 2009 నవంబర్ 10వ తేదీ మధ్య, అండర్–18కు 2005 నవంబర్ 11వ తేదీ నుంచి 2007 నవంబర్ 10వ తేదీ మధ్య, అండర్–20 విభాగంలో పాల్గొనబోయే క్రీడాకారులు 2003 నవంబర్ 11వ తేదీ నుంచి 2005 నవంబర్ 10వ తేదీ మధ్య జన్మించి ఉండాలన్నారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఏలూరులోని ఏఎస్ఆర్ స్టేడియంలో జరగనున్న అంతర్‌జిల్లాల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పరిశ్రమలకు పవర్ హాలిడే తొలగింపు

విజయనగరం ఫోర్ట్: పరిశ్రమలకు వారంలో ఒక రోజు విధించిన పవర్ హాలిడేను తొలిగించినట్టు విద్యుత్‌శాఖ ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ డిమాండ్ పెరగడం, విద్యుత్ ఉత్పతి పూర్తిస్థాయిలో జరగకపోవడంతో ఈ నెల 5 నుంచి 15 వ తేదీ వరకు వారంలో ఒక రోజు పవర్ హాలిడే విద్యుత్ శాఖ విధించింది. అయితే, వర్షాలు విస్తారంగా కురవడం, పవన విద్యుత్ ఉత్పత్తి పెరగడంతో ప్రస్తుతం పవర్ హాలిడేను తొలిగించినట్టు చెప్పారు.

9న కోడూరుమాత యాత్ర





కోడూరుమాత గుహ ప్రదేశం, గుహలోనున్న కోడూరుమాత విగ్రహం

కోడూరు(బాడంగి): విజయనగరం జిల్లా బాడంగి మండలం కోడూరులో వెలసిన పరిశుద్ధ కోడూరు మాత యాత్ర ఈ నెల 9వ తేదీ శనివారం నిర్వహించనున్నారు. గత నెల 31వ తేదీ నుంచే నవదిన ప్రార్థనలు ప్రారంభంకాగా, ఈ నెల 8వ తేదీ వరకు జపమాల, దివ్యపూజలు జరగనున్నవి. పదోరోజు యాత్రలో భాగంగా పర్వదిన కార్యక్రమాలు నిర్వహిస్తామని పుణ్యక్షేత్ర డైరెక్టర్ పి.యుగల్‌కుమార్ తెలిపారు.

పూజలు ఇలా..
ఈనెల 9వ తేదీ ఉదయం 7 గంటలకు జాబిలిగురువులతో మొదటిపూజ, 9 గంటలకు శ్రీకాకుళం పీఠాధిపతి డా.రాయవిజయ్‌కుమార్‌తో రెండవపూజ, ఉదయం 11 గంటలకు విశాఖ అగ్రపీఠాధిపతి డా.మల్లవరపు ప్రకాశ్ సమక్షంలో మూడవ పూజ, మధ్యాహ్నం ఒంటి గంటకు విజయనగరం డీనర్ గురువు, నూతన గురువులతో నాలగవపూజ , 3 గంటలకు దివ్యసత్ప్రసాద ఆరాధన, ద్వివ్య కారుణ్యజపమాల ఉంటుంది. అనంతరం మరియతల్లి తేరుప్రదర్శన జరగనుంది.

పటిష్టబందోబస్తు..
ఉత్తరాంధ్ర, ఒడిశా భక్తులు అధికమంది కోడూరు మాత యాత్రలో పాల్గొనే అవకాశం ఉండడంతో బొబ్బిలి డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ తిరుమలరావు, బొబ్బిలి, తెర్లాం, రామభద్రాపురం, బాడంగి ఎస్ఐలు బందోబస్తు విధులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు భక్తుల రాకపోకలకు వీలుగా విజయనగరం, సాలూరు, పార్వతీపురం, శ్రీకాకుళం ఆర్టీసీ డీపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. మౌలిక వసతుల కల్పనకు స్థానిక అధికారులు చర్యలు చేపట్టారు.

దంచికొట్టిన వాన

- పార్వతీపురం పట్టణంలో కుండపోత
- జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారితో పాటు పలు ప్రాంతాలు జలమయం
- లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి చేరిన వర్షపునీరు
- వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం



పార్వతీపురం బైపాస్ కాలనీలో ఇంట్లో చేరిన వర్షపునీటిని తోడుతున్న వృద్ధురాలు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంతో పాటు నాలుగు నియోజకవర్గాల్లోనూ బుధవారం వర్షం దంచికొట్టింది. పార్వతీపురం పట్టణం, వీరఘట్టం, బలిజిపేట మండలాల్లో మూడు గంటలపాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో గెడ్డలు, వాగులు పొంగిప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కొన్నివీధుల్లోని ఇళ్లలోకి నీరు చొరబడింది. రాకపోకలకు, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. పాలకొండ, సీతంపేట, గరుగుబిల్లి, బలిజిపేట మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది.

ఎటు చూసినా నీరే...
కుండపోత వర్షానికి పార్వతీపురం బైపాస్ కాలనీలో ఇళ్లల్లోకి నీరు చేరింది. ఎస్.ఎన్.పురం కాలనీ రోడ్డు, సౌందర్యథియేటర్ వెనుకన ఉన్న కృష్ణా కాలనీ చెరువును తలపించాయి. పాలకొండ నియోజకవర్గంలోని పాలకొండ–వీరఘట్టం రోడ్డుపై రాజుపేట సమీపంలో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో కాసేపు రాకపోకలు నిలిచిపోయాయి. పాలకొండ పట్టణ శివారు ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై ప్రవహించింది. నీటి ఎద్దడి సమయంలో వరుణుడు కరుణించడంతో రైతులు హర్షంవ్యక్తంచేస్తున్నారు.

వర్షంతో అన్నదాత హర్షం..
జూన్, జూలై, ఆగస్టు నెలల్లో మొఖం చాటేసిన వరుణుడు గత మూడు రోజులుగా కరుణించాడు. వర్షాలు విస్తారంగా కురవడంతో చెరువులు, ప్రాజెక్టుల్లో నీరు చేరింది. వరి చేనుకు సమృద్ధిగా నీరు అందడంతో రైతులు సంతోషపడుతున్నారు. వర్షం వరి చేనుకు మేలు చేస్తుందని చెబుతున్నారు.

సహాయక చర్యల్లో ఎమ్మెల్యే జోగారావు
పార్వతీపురంలో జలమయమైన కాలనీలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. మున్సిపల్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు మళ్లింపునకు అధికారులతో కలసి జేసీబీల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. నీట మునిగిన ప్రాంతాలవారికి ఆహారపొట్లాలు అందజేశారు. ముంపునకు గల కారణాలు అడిగి తెలుసుకొని భవిష్యత్‌లో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అందుకు తగ్గ ప్రణాళికలను రూపొందించి మున్సిపల్ సమావేశంలో ప్రవేశపెట్టాలని అధికారులకు సూచించారు.



పార్వతీపురంలో జలమయమైన లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

నిలకడగా 'తోటపల్లి'



తోటపల్లి ప్రాజెక్టువద్ద పరిస్థితి

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలతో తోటపల్లి ప్రాజెక్టువద్ద బుధవారం సాయంత్రానికి 105 మీటర్లకు 104.46 మీటర్లమేర నీరు నిల్వఉంది. ప్రస్తుతం నది నుంచి ప్రాజెక్టులోకి 3,689 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, అధికారులు ఒక గేటును ఎత్తివేసి 1,389 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 2.5 టీఎంసీలకు 2.175 టీఎంసీలు ఉంది. పాత కుడి, ఎడమ కాలువల ద్వారా 520 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువ ద్వారా 900 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు.

క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ కోసం ఎంపీకి వినతి

- ఎంపీ బెల్లానకు వినతిపత్రం అందజేసిన ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు



ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

చీపురుపల్లి: ఎస్సీలు అభ్యున్నతికి ఎంతో అవసరమైన వర్గీకరణ బిల్లు తీసుకొచ్చే విధంగా పార్లమెంటులో ప్రస్తావించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భోగి శ్రీను, చీపురుపల్లి మండల అధ్యక్షుడు కోరుకొండ దాలయ్య కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గాల్లో ఏ, బీ, సీ, డీ ఉన్నట్లు ఎస్సీల్లో కూడా వర్గీకరణ జరగాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ వర్గకరణ జరిగే విధంగా చొరవ చూపాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పార్లమెంటులో కూడా చర్చించాలని కోరారు. ఎస్సీల్లో ఉన్న ఉప కులాలకు మేలు జరగాలంటే ఎస్సీ వర్గీకరణ జరగడం అవసరమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ చీపురుపల్లి నియోజకవర్గ కన్వీనర్ కిల్లాడ సురేంద్ర, రెల్లి కుల అధ్యక్షుడు రౌతు కనకరాజు, మెరకముడిదాం మండల అధ్యక్షుడు అప్పారావు మాదిగ, జిల్లా ప్రచార కార్యదర్శి గర్భాపు నరేష్, గుర్ల మండల కార్యదర్శి కింతాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



అదృశ్యమైన శ్రీలక్ష్మి(ఫైల్)

చీపురుపల్లి: పట్టణంలోని విజయ కాలనీకు చెందిన కె.శ్రీలక్ష్మి(43) అనే మహిళ అదృశ్యమైనట్లు తండ్రి టొప్ప అప్పారావు బుధవారం ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ ఎ.సన్యాశినాయుడు బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు... అదృశ్యమైన శ్రీలక్ష్మి తన భర్తతో మనస్పర్థలు కారణంగా పదేళ్లుగా విజయ కాలనీలో తండ్రి వద్ద ఉంటోంది. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తోంది. ప్రతీ రోజూ విధులకు వెళ్లినట్టుగానే సెప్టెంబర్ 2న ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లింది. తిరిగి ఇంటికి చేరలేదు. దీంతో తండ్రి పాఠశాలకు వెళ్లి విచారించగా సెప్టెంబర్ 2న మధ్యాహ్నం 1 గంట వరకు పాఠశాలలో ఉండి తరువాత ఇంటికి వెళ్తానని చెప్పి ఆమె వెళ్లిపోయినట్లు అక్కడి వారు వివరించారు. కానీ తిరిగి ఆమె ఇంతవరకు ఇంటికి చేరలేదు. దీంతో శ్రీలక్ష్మి ఆచూకీ కోసం తండ్రి అప్పారావు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

విజయనగరం క్రైమ్: గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను టుటౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని, వారి నుంచి 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి టు టౌన్ సీఐ ఎన్‌హెచ్.విజయానంద్ తెలిపిన వివరాలు.. వైఎస్సార్ నగర్‌లో గంజాయి విక్రయిస్తున్న సమాచారం తెలుసుకుని బుద్దరాజు రఘు వర్మ, మందా రవిని అదుపులోకి తీసుకుని ఒక్కొక్కరి నుంచి పది కిలోల గంజాయి, మొబైల్, నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వీరిద్దరు బరంపురం నుంచి శివరాం అనే వ్యక్తి నుంచి కిలో రూ.మూడు వేల చొప్పున గంజాయి కొనుగోలు చేసినట్టు తెలుసుకుని జేఎన్‌టీయూ జంక్షన్ సమీపంలో శివరాంను చూపించగా అతన్ని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. శివరాం నుంచి ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹148	₹268	₹ 276

ఇండియా 1ఏటీఎంల్లో వరుస చోరీలు

- రెండో చోట్ల నగదు చోరీ
- గ్యాస్ కట్టర్లతో మిషన్లు కట్ చేసిన దుండగులు



బొండపల్లి: గ్యాస్ కట్టర్‌తో ఇండియన్ ఏ1 ఏటీఎం మిషన్‌ను కట్ చేసిన దృశ్యం



బొండపల్లి: గొట్లాంలోని ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్పీ దీపికా పాటిల్

బొండపల్లి: గజపతినగరం పోలీస్ సర్కిల్ పరిధిలో ఒకే రోజు రాత్రి గంటల వ్యవధిలో ఇండియన్ ఏటీఎంకు చెందిన రెండు కేంద్రాల్లో భారీ చోరీ జరిగింది. గ్యాస్ కట్టర్లు ఇతర పరికరాలను ఉపయోగించి ఏటీఎం యంత్రాలను కట్ చేసి అందులో నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బుధవారం వేకువజామున జరిగిన ఈ చోరీలు స్థానికంగా సంచలనం కలిగించాయి. వివరాల్లోకి వెళ్తే.. దత్తిరాజేరు మండలం పెదమానాపురం సంతతోటలో గల ఇండియన్ ఏ1 ఏటీఎం కేంద్రంలో పాటు, బొండపల్లి మండలం గొట్లాం గ్రామంలో గల అదే ఏటీఎం కేంద్రంలో కూడా గుర్తు తెలియని దుండగులు నగదు అపహరించుకుపోయారు. దుండగులు ఏపీ 28సీఏ 2915 బొలెరొ వాహనంలో వచ్చి చోరీకి పాల్పడినట్టు ఆధారాలు బట్టి తెలిసిందని ఎస్‌ఐ ఎస్.రవి తెలిపారు. గొట్లాం ఏటీఎం కేంద్రాన్ని ఎస్పీ ఎం.దీపికా పాటిల్‌తో పాటు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్, ఇన్‌చార్జి సీఐ ఎస్.తిరుమలరావు పరిశీలించారు. దగ్గరలోని దుకాణాల్లో గల సీసీ కెమెరాలను పరిశీలించి దొంగతనానికి పాల్పడిన తీరును పరిశీలించారు. ఏటీఎంకు సమీపంలోనే బొలెరొ వాహనం నిలిపి అక్కడ నుంచి నగదు అపహరించుకుపోయినట్టు తెలుస్తుందన్నారు. వాహనంలో ఏటీఎంను తెరిచేందుకుగాను గ్యాస్ కట్టర్‌తో పాటు, గ్యాస్ సిలిండర్‌ను కూడా తెచ్చినట్టు గుర్తించామన్నారు. గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం మిషన్‌ను కట్ చేసి అందులో నగదును అపహరించుకుపోయినట్టు గుర్తించామని తెలిపారు. ఏటీఎం మిషన్‌లో ఎంత నగదు ఉందో, చోరీకి పాల్పడిన వారి వివరాలు తెలియరాలేదన్నారు. ఇప్పటి వరకు ఇండియన్ ఏటీఎం ఏ1 నిర్వాహకుల నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు. విజయనగరం నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించిందని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్టు పేర్కొన్నారు.

ఏటీఎంలో చోరీ



దత్తిరాజేరు: పెదమానాపురం ఏటీఎం వద్ద పరిశీలిస్తున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంత వద్ద జాతీయ రహదారి పక్కనున్న ఇండియా-1 ఏటీఎంలో చోరీ జరిగింది. దుండగులు గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను కట్ చేసి భారీ మొత్తంలో నగదును ఎత్తుకెళ్లినట్టు పెదమానాపురం ఏఎస్‌ఐ కాశీరావు బుధవారం తెలిపారు. ఏఎస్‌ఐ తెలిపిన వివరాలు.. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న హోటల్ 99 వద్ద పార్కింగ్ చేసిన పెదమానాపురం గ్రామానికి చెందిన బోర రవి కారును అపహరించిన అనంతరం బీసీ కాలనీ వద్ద ఏడు కొండలు ఇంజినీరింగ్ వర్క్స్(వెల్డింగ్) షాపులో ఉన్న గ్యాస్ కట్టర్, గ్యాస్ బండలను కూడా అపహరించారు. అక్కడ నుంచి ఏటీఎంకు వెళ్లి చోరీకి పాల్పడ్డారు. రూ.11లక్షల 96 వేలు దోచుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని ఎస్పీ దీపికా పాటిల్, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్, గజపతినగరం ఎస్‌ఐ గంగరాజు పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

బిడ్డను రక్షించి.. మృత్యు ఒడిలోకి...

- బస్సు కింద పడి గిరిజనుడి మృతి
- తుంబన్న కాలనీలో విషాదం



ప్రమాదం నుంచి బయటపడ్డ ఈశ్వర్



బస్సు కింద పడి మరణించిన సింధు, (ఇన్‌సెట్లో) సింధు

సీతంపేట: ప్రమాదవశాత్తు బస్సు ముందు చక్రాల కింద పడి ఓ గిరిజనుడు బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనతో తుంబన్నకాలనీలో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తుంబన్న కాలనీకి చెందిన ఆరిక సింధు(43) తన ఏడాదిన్నర కుమారుడు ఈశ్వర్‌ను చంకనెత్తుకుని నిత్యావసర సరుకుల కొనుగోలుకు కొత్తూరు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కొత్తూరు నుంచి పాలకొండ వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కాడు. మార్గ మధ్యలో పులిపుట్టి వద్ద కుమారుడిని ఎత్తుకుని బస్సు దిగిపోయాడు. అక్కడ నుంచి తన స్వగ్రామమైన తుంబన్నకాలనీకి వెళ్లే క్రమంలో తాను దిగిన బస్సు ముందు భాగం నుంచి రోడ్డు దాటే యత్నం చేశాడు. వీరిని గమనించని బస్సు డ్రైవర్ బస్సును ముందుకు పోనివ్వడంతో సింధు బస్సు ముందు చక్రాల కిందకు వెళ్లిపోయాడు. తన చంకన ఉన్న చంటి బిడ్డ ఈశ్వర్‌ను దూరంగా విసిరేయడంతో బిడ్డ సురక్షితంగా బయటపడ్డాడు. ఈ ప్రమాదంలో సింధు మృతి చెందడంతో స్వగ్రామంలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నీలకంఠం సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య మేరి, మరో ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రమాదవశాత్తు నదిలో పడి మహిళ మృతి



నదిలో తేలియాడుతున్న మంగమ్మ మృతదేహం

నెల్లిమర్ల: ప్రమాదవశాత్తు స్థానిక చంపావతి నదిలో పడి మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం పూతికపేటకు చెందిన యడ్ల మంగమ్మ(49) గుర్ల మండలం గోషాడకు పరామర్శకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జ్యూట్ మిల్లు సమీపంలో చంపావతి నదిలో జారిపడి మృతి చెందింది. జ్యూట్ మిల్లు గెస్ట్‌హౌస్ వద్ద నదిలో మృతదేహం లభ్యమైంది. బంగారమ్మకు చిన్నతనంలో వివాహం జరగ్గా భర్త వదలివేయడంతో తండ్రి వద్దే ఉంటుంది. ఎస్‌ఐ పి.నారాయణరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- నాబార్డ్ డీజీఎం మురళీ మనోహర బెహరా



మహిళలతో చర్చిస్తున్న అధికారుల బృందం

విజయనగరం రూరల్: మహిళలు ఆర్థిక స్వావలంభనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని నాబార్డ్ డీజీఎం మురళీ మనోహర బెహరా పేర్కొన్నారు. మండలంలోని కొండకరకాం గ్రామంలో జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహిస్తున్న అగరబత్తీల తయారీ కేంద్రాన్ని అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా అగర్‌బత్తీ తయారీ కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ముడిసరుకు, ఉత్పత్తి, విక్రయాలపై మహిళలతో చర్చించారు. అనంతరం మహిళలతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై వారికి సూచనలు అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, నాబార్డ్ డీడీఎం నాగార్జున, ఏపీడీ సావిత్రి, డీపీఎంబిబి లక్ష్మునాయుడు, ఏపీఎం స్వామి, సీసీలు నాయుడు, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీ టాప్ స్కోరర్‌గా తపస్వి

- 358 పరుగులతో మొదటి స్థానం



పిన్నింటి తపస్వి

విజయనగరం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 6 వరకు విశాఖ, విజయనగరం వేదికలుగా సీనియర్ విభాగంలో నిర్వహించిన అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నీలో జిల్లాకు చెందిన పిన్నింటి తపస్వి 358 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడని విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు బుధవారం తెలిపారు. రెస్టాఫ్ నార్త్ జట్టులో సభ్యుడైన తపస్వి శ్రీకాకుళం జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌లో 28 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, రెస్టాఫ్ సెంట్రల్ జట్టుతో జరిగిన రెండో మ్యాచ్‌లో 70 పరుగులు సాధించాడు. గుంటూరుతో జరిగిన మూడో వన్డేలో మరింత విజృంభించి సెంచరీ (100 పరుగులు) సాధించగా, అనంతపురంతో జరిగిన నాలుగో మ్యాచ్‌లో 60 పరుగులతో రాణించాడు. రెస్టాఫ్ ఆఫ్ సౌత్‌తో జరిగిన ఆఖరి మ్యాచ్‌లో మరింత విజృంభించి చివరి వరకు నిలిచి సెంచరీ (100 పరుగులు) సాధించి నాటౌట్‌గా నిలవడమే కాకుండా మ్యాచ్‌ను గెలిపించాడు. రెస్టాఫ్ నార్త్ ఆడిన అన్ని మ్యాచ్‌లు గెలిచి టేబుల్ టాపర్‌గా నిలవడమే కాకుండా టాప్ ఆర్డర్‌లో రాణించిన తపస్వి 358 పరుగులతో రాష్ట్ర స్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలిచాడు. తపస్విని డీసీఏ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, ట్రెజరర్ పి.సీతారామరాజు, సెలెక్టర్లు బంగార్రాజు, పీఎస్ వర్మ, సర్పరాజ్‌లు, జిల్లా క్రికెట్ క్రీడాకారులు అభినందించారు.

గ్రామ స్వరాజ్యం ఘనత వైఎస్ జగన్‌దే..



భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, ఇతర ప్రజాప్రతినిధులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం రూరల్: దేశ చరిత్రలోనే మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కిందని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని మలిచర్ల, సుంకరిపేట గ్రామాల్లో రూ.40 లక్షలకు పైగా నిధులతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు బుధవారం జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల భవన ప్రారంభోత్సవాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎంపీపీ మామిడి అప్పలనాయుడు మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే సాధ్యమైందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యం, సుపరిపాలనకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. రైతుభరోసా కేంద్రాలతో గ్రామాల్లోనే రైతులకు మెరుగైన సేవలు అందించడం జరుగుతుందన్నారు. మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కొసరి నిర్మల, మలిచర్ల, సుంకరిపేట సర్పంచులు తుమ్మగంటి రమాకుమారి, సుంకరి రాజేశ్వరి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

- 15 మందికి గాయాలు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



యలకల లావణ్య, అదపాక శ్రీను, మీసాలశీతం నాయుడు

చీపురుపల్లి: పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. మండలంలో ఐదారు గ్రామాల్లో కలియ తిరిగింది. కనిపించిన వారిని కనిపించినట్లే మీద పడి గాయపరిచింది. చిన్న, పెద్ద, ముసలి తేడా లేకుండా కంట పడిన ప్రతీ ఒక్కరినీ కరిచేసింది. శరీరాలపై ముక్కలు ఊడినట్లు రక్తం చిందేంత వరకు విడిచిపెట్టకుండా గాయపరిచింది. పిచ్చి కుక్క దాడిలో దాదాపు 15 మంది వరకు గాయపడ్డారు. వీరంతా పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో చికిత్స పొందుతున్నారు. అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడులు పరామర్శించారు. తక్షణమే ఏంటీ రేబీస్ వ్యాక్సిన్లు వేసి, చికిత్స అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.నాయక్‌ను కోరారు. బుధవారం ఉదయం నుంచి పిచ్చెక్కిన ఒకే కుక్క పదిహే మందిని గాయపరిచింది. మండలంలోని జి.ములగాంలో బుధవారం ఉదయం ప్రారంభమైన పిచ్చి కుక్క స్వైర విహారం ఇటకర్లపల్లి, పేరిపి, యలకలపేట, నాగంపేట, పుర్రేయవలస, జి.అగ్రహారం, చీపురుపల్లి ప్రాంతాల్లో కంట పడిన పదిహేను మంది వరకు గాయపరిచింది. పిచ్చి కుక్క దాడిలో గాయపడిన యలకల లావణ్య(పేరిపి), బెవర సింహాచలం(నాగంపేట), అదపాక శ్రీను(ఇటకర్లపల్లి), మీసాల శీతంనాయుడు(ఇటకర్లపల్లి), పున్నాన అప్పలరాము(యలకలపేట), గడల నీలకంఠం(చీపురుపల్లి), అంధవరపు రామారావు(చీపురుపల్లి) తీవ్ర గాయాలతో చీపురుపల్లి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. మరికొంత మందికి స్వల్ప గాయాలవ్వడంతో వ్యాక్సిన్ వేయించుకుని ప్రథమ చికిత్స చేయించుకుని ఇళ్లకు వెళ్లిపోయినట్లు వైద్యులు తెలిపారు.

ఆన్‌లైన్‌లో.. 'అంగన్‌వాడీ'ల సేవలు

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు ఇకపై యాప్‌లో నమోదు కానుంది. కేంద్రం తెరిచిన నుంచి మళ్లీ ముగించే వరకు కేంద్రంలో జరిగే అన్ని కార్యకలాపాలు యాప్‌లో కార్యకర్త నమోదు చేయాలి. పిల్లల హాజరు నుంచి మధ్యాహ్న భోజనం వరకు ప్రతీది నమోదు చేయడం ద్వారా కేంద్రాల నిర్వహణలో పారదర్శకతను తెచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

- అంగన్‌వాడీ కేంద్రాలలో జరిగే ప్రతి విషయం ఆన్‌లైన్‌లో నమోదు
- అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్లు అందజేసిన ప్రభుత్వం
- జిల్లాలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలు



పట్టణంలోని పోలయ్యపేటలో పిల్లలకు బోధిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త



ప్రభుత్వం అందించిన స్మార్ట్ ఫోన్

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్రాల పట్ల ఉన్న అపవాదును తొలిగించే విధంగా చర్యలకు ఉపక్రమించింది. అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయడంతో పాటు ఎటువంటి అవకతవకలకు తావివ్వకుండా ఉండే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యే పిల్లల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, పూర్తి స్థాయిలో హాజరు అయినట్టు రికార్డుల్లో నమోదు చేసి వారికి అందాల్సిన పౌష్టికాహారం పక్కదారి పట్టిస్తున్నారనే అపవాదు అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉండేది. ఇటువంటివి ఇకపై కుదరవు.

ప్రతీది ఆన్‌లైన్‌లో నమోదు

అంగన్‌వాడీ కేంద్రంలో రోజూ జరిగే ప్రతి విషయాన్ని వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. అంగన్‌వాడీ కేంద్రం తెరిచినప్పటి నుంచి ఉదయం 9 గంటలకు పిల్లలు హాజరు, గుడ్లు పెట్టినప్పుడు, మధ్యాహ్న భోజనం చేసినప్పుడు ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అదేవిధంగా గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ ఇస్తున్నారు. టేక్ హోం రేషన్ ఇస్తున్నప్పుడు కూడా గర్భిణులు, బాలింతలకు ఫొటో తీసి వాటి వివరాలు కూడా యాప్‌లో నమోదు చేస్తారు. ఈ విధంగా యాప్‌లో అప్‌లోడ్ చేయడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. ఫొటోలో ఉన్న వారి కంటే అదనంగా లబ్ధిదారులు కేంద్రానికి వచ్చారని చెప్పడానికి వీలు ఉండదు. దీని వల్ల గతంలో మాదిరి పిల్లలు రాకపోయినా వచ్చినట్టు హాజరు వేసుకోవడానికి వీలు ఉండదు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పథకాలు పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అందుతాయి.

కార్యకర్తలు స్మార్ట్‌ఫోన్లు

అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే వివరాలు నమోదు కోసం స్మార్ట్ ఫోన్లు కొద్ది రోజులు క్రితం అందించింది. జిల్లాలో 2499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 2499 మంది కార్యకర్తలు పని చేస్తున్నారు. వీరికి స్మార్ట్ ఫోన్లు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 9827 మంది గర్భిణులు, 9556 మంది బాలింతలు ఉన్నారు. 3నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలు 18,410మంది, 0 నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు 44,755 మంది ఉన్నారు. వీరందరి వివరాలు అంగన్‌వాడీ కార్యకర్తలు వారికి ఇచ్చిన ఫోన్లలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో నమోదు చేయాలి.

బలవర్ధకమైన ఆహారం

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పిల్లలకు ప్రభుత్వం బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తుంది. రోజుకో రకమైన భోజనాన్ని అందిస్తుంది. ఆకుకూరలు, పప్పు, కాయగారలు, గుడ్డుతో కూడిన ఆహారం అందిస్తుంది. పాలు ప్రతి రోజు అందిస్తుంది. పిల్లలకు 100 మి.లీ, గర్భిణులు, బాలింతలకు 200 మి.లీ పాలు చొప్పన ఇస్తున్నారు. గర్భిణులకు పప్పు చెక్కీలు, రాగి పిండి, బెల్లం, కర్జూరం పంపిణీ చేస్తున్నారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని తగ్గించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

యాప్‌లో వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలు వివరాలు యాప్‌లో ప్రతి కార్యకర్త నమోదు చేయాల్సి ఉంది. ఇందుకోసం ప్రభుత్వం వారికి స్మార్ట్ ఫోన్లు అందించింది. రోజు వారీ జరిగే కార్యక్రమాలు ఫొటో తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. దీని వల్ల ఎటువంటి తప్పిదాలు జరగకుండా ఉంటాయి. కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వం అందించే పథకాలు, పౌష్టికాహారం అందుతాయి.

– బి.శాంతకుమారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి